కథానిక

# ఎవరు క్షంతవ్యులు?

అంగర పాండురంగారావు

పురాతనమైన బంగళా అది. ఇంటివాకిలి అంతా చెట్లగుబురులతో నిండి జీబురుమంటున్నది. సాయంకాలం ఏడుగంటలవుతుంది. చీకట్లు దట్టంగా వ్యాపిస్తున్నాయి. ఆ యింటియజమాని అజయ బాబు చాలా పేరుపొందిన లాయరు. అసలా వూరే అంత పెద్దదికాదు. ఉన్న లాయర్లలలో అజయ బాబు తెలివైనవాడని చాల మంచివాడని ప్రతీతి.

సరిగ్గా ఏడున్నరగంటకి జమీందారిణి రమాదేవి వద్దనుండి అతనికి కబురువచ్చింది. అజయబాబు చాలా ఆశ్చర్యపడ్డాడు. ఆమె చరిత్ర చాలా విచిత్రమైనది. జమీందారు చనిపోయి చాలాకాల మైంది. పిల్లలులేరు. జమీందారిణి మాత్రం మధ్య వయస్కురాలైనా మంచంపట్టి చాలా కాల మైంది. ఆమె యిప్పుడు మరణావస్థలో నుందని సులువుగా గ్రహించాడు. వెంటనే మోటారుమీద బయల్దేరి వెళ్ళాడు. ఇంట్లో అడుగుపెడుతూనే అజయబాబు పరిచారిక లెక్కువలేక పోవడం చూసి కొంచెం ఆశ్చర్యపడ్డాడు. జమీందారిణి మంచంమీద పడుకొనివుంది. అక్కడ ఒక్క డాక్టరు కూడా లేకపోవడం అజయబాబుకి వింత గొల్పింది. చనిపోయేటప్పుడు ఒక్కడాక్టర్ని కూడా నియోగించని ఆమె గుండె దిటవుకు ఆశ్చర్యపోయేడు. ఆమె మంచంవద్దకు సమీపించి ముఖంవైపు కూర్చున్నాడు. జమీందారిణి రమా దేవి స్పృహలోనేవుంది. ఆమె అంత ముదుసలి కాకపోయినా చిరకాల రోగమువల్ల జీనచ్ఛవము లావుంది. ఆమె హీనస్వరంతో "అజయబాబూ, మీరు నాకొక సహాయం చెయ్యాలి. అదిచాలా సహనముతో కూడినది. నా వీలునామా ఆబల్లమీద ఉంచాను. ఆ విల్లు ప్రకారం నా వారసునికి నాసంప దంతా సక్రమిస్తుంది. దానికివికైకవారసుడైన నా కుమారుణ్ణి మీరు వెతికితీసుకురావాలి. అతన్ని తీసుకు వచ్చేపక్షంలో యాభైవేలూ,తీసుకురాలేనిపక్షంలో ఐదువేలు మీరు ఫీజుగా పొందవచ్చును" అంది.

అజయబాబు ముఖం మరింత గంభీరమైనది. అటు ఇటు చూశాడు. ఆ గదిలో వారిద్దరు తప్ప మరెవ్వరూలేరు. రమాదేవి ముందే కట్టుదిట్టం చేసిందన్నమాట ఏదో విషమపరిస్థితిని కూడా ఎదుర్కొనే హృదయంతో అతడు వినసాగాడు. రమాదేవి అతి కష్టంతో లేచి కూర్చుంది.

"నేను చెప్పేది పూర్తిగావింటే నా కథ తెలుసుకొన్నవారు ప్రపంచంలో మీరొక్కరే అవుతారు. నా కథలోని ప్రతి అంశాన్నీ మీరు వినాలి. మీరు ప్రఖ్యాత న్యాయవాదులేగాక,సహృ దయులని కూడా విన్నాను. కాబట్టి నన్ను బాగా అర్థంచేసుకో గలుగుతారని ఆశిస్తున్నాను. నాకీ బూశులీ జమీందారుతో పెండ్లికాకముందే వినోద్ బాబుని ప్రేమించాను. కాని అతడు పేదవాడని, సంప్రదాయ కుటుంబములోని వాడుకాదని నా తలిదండ్రులు నా కతనితో పెండ్లి చేయలేదు. తర్వాతీ బాశులీ జమీందారుకు నన్నిచ్చి వివా హం చేశారు. భయంవల్ల, అజ్ఞానంవల్ల నేనీ పెళ్ళికి ఒప్పుకున్నాను. నాకొక కొడుకు పుట్టాడు. తర్వాత కొద్దిసంవత్సరాలకే నాభర్త మరణించాడు. నేను యవ్వనంలోనే వితంతువునయాను. నా దుర దృష్టంకొద్దీ నా తలిదండ్రులు రైలు ప్రమాదంలో మరణించారు. నేను ఏకాకినయ్యాను. నా అన్న వాళ్లెవరూ లేనప్పుడు వినోదబాబు వచ్చి ఊరడిం చాడు. నేనతన్ని పొమ్మనవలసింది. కాని నిరా ధారనై, నిస్సహాయంలో ఉన్న నాకు దిక్కు తోచలేదు. నేనింకా అతన్ని ప్రేమిస్తూనేవున్నాను. అతన్ని పొమ్మనగల శక్తి నాకులేదు. అదీగాక దుఃఖార్తనైయున్న నాయెదుట మోకరించి కన్నీ టితో, జాలి మాటలతో నన్ను వేడుకొంటున్న అతన్ని కాదనగలనా? దానికెంత త్యాగం, గుండె ధైర్యం కావాలో ఆలోచించండి. ఆ పరిస్థితుల్లో నేను నిజంగా అబలనయ్యాను. చివరికి అతని ప్రియురాలినయ్యాను. పన్నెండు సంవత్సరాలు

పోయిగా గడిచిపోయాయి. నేను, ఆయనా కలసి నా కుమారుణ్ణి పెంచి పెద్దవాణ్ణి చేసాము. నా కొడుకు హరీంద్రుడు సన్నగా రివటలాగ వుండే వాడు. వాడి తండ్రిలాగే బుద్ధిమంతుడు హరీన్, వినోద్ బాబుని బాబాయి అని పిలిచేవాడు. నాకు ముఖ్యమైన స్నేహితుడు అనే అనుకొనే వాడుగాని ఏనాడు మా సంబంధముకూర్చి సంశ యించలేదు. బాబాయి చాల మర్యాదస్థుడని నమ్మేవాడు. అతని సలహామీదనే నడిచేవాడు. చిన్ననాటినుంచి మా యింట్లో ఆయన ఉనికికి అలవాటు పడ్డాడు. మేము ముగ్గురం ఒక స్నేహి తులుగా మాత్రం ఉండేవాళ్ళం.

ఒక సాయంత్రం మేము ముగ్గురం కలిసి భోజ నము చేయాలని నిర్ణయించుకున్నాము. నేను మేడ మీద డ్రాయింగ్‌రూములో కూర్చుని వున్నాను. వారిద్దరిలో ఎవరు ముందువస్తారో అని ఆలో చిస్తున్నాను. ఇంతలో తలుపు తెరువబడింది. వినోద్‌బాబు లోనికి ప్రవేశించాడు. నేను చేతులు చాచి అతనివద్దకు వెళ్ళాను. నాలుగు పెదవులు కలుసుకొన్నాయి. గాఢ పరిష్వంగంలో తన్మ యత్వం చెందాను. వెంటనే ఒక చిన్న అలజడి, బల్లకదిలిన శబ్దం, గదిలో యింకెవరో ఉన్నారనే భ్రాంతి అయి తటాలున వెనక్కి తిరిగి చూశాము. నా కుమారుడు హరిన్ వెనుక గుమ్మంనుండి వచ్చాడు కాబోలు! తీక్షణంగా చూస్తున్నాడు. అతని ముఖంలో కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు. నాకు మిన్నువిరిగి మీద పడినట్లయింది. చేతులు చాచి నా అనుంగుబిడ్డను కౌగలించుకుందామని వెళ్ళాను. కాని అతడు వెనుదిరిగి వెళ్ళిపోయాడు. మళ్ళీ యింతవరకు కనిపించలేదు.

రమాదేవి కొంచెం ఆపింది. కాని ఆమె కన్నుల నుండి సంతత ధారాపాతంగా కారుతున్న కన్నీళ్లు మాత్రం ఆగలేదు. విజయబాబు ముఖంలో గాంభీర్యం తగ్గలేదు. ఉఛ్ఛ్వాస, నిశ్వాసములు కూడా జరుపుతున్నట్లులేదు. రమాదేవి మళ్ళీ అందుకొన్నది "నా ప్రియుడు, నేను నిర్ఘాంతపోయి చూస్తున్నాము. అవమానంతో కుర్చీలో కూలి పోయి వెక్కి వెక్కి ఏడ్చాను. మాతృ హృద యాన్ని అవమానపరచే సిగ్గుతో; లజ్జతో నాశరీ రంలోని ప్రతీ అణువూ కృంగియిపోయింది. వినోద్‌బాబు పాలిపోయిన ముఖంతో నాదగ్గరకి రావడానికే సాహసించలేదు. ఏ క్షణంలోనైనా నా హరీన్ నాదగ్గరికి మళ్ళీ వస్తాడని నమ్మకం మా యిద్దరికీ వుంది. ఆఖరికి వినోద్ "నేనువెళ్ళి హరీ న్‌ను కలసికొంటాను, మాట్లాడ్తాను. అంతా విశద పరుస్తాను" అంటూ వెళ్ళిపోయాడు. నేను శోక తప్తనై ఎదురుచూస్తున్నాను. గంట, రెండుగంటలు గడిచాయి. అర్థంకాని భయాలు నన్ను చుట్టుకొ న్నాయి. నాబిడ్డ ఎక్కడున్నాడో!ఏంచేస్తున్నాడో!

అర్థరాత్రి నౌకరు చీటీ తీసుకొచ్చాడు. "హరీంద్రుడు తిరిగి వచ్చాడా? నాకెక్కడా కన బడలేదు. క్రింద చావిడిలో నిరీక్షిస్తున్నాను. ఇంత అర్థరాత్రివేళ పైకిరావడం మంచిది కాదను కొంటాను. వినోద్" అని వుంది దానిమీద. నేను యిలా వ్రాసి పంపాను. "హరీన్ రాలేదు. నీవు తప్పక తీసుకురావాలి." ఆరాత్రంతా చలిగాలిలో గడపటంవల్ల మర్నాటికి జ్వరం వచ్చింది. ఆరో జంతా కన్ను తెరవలేదు. మళ్ళీ తెలివొచ్చేటప్ప టికి వినోద్ ఒక్కడే, హరీన్‌లేడు, నా మంచం వద్ద కూర్చుని ఉన్నాడు. "నాబిడ్డా...ఎక్క డున్నాడు నా హరీన్" అని ఏడిచాను. అతను మాట్లాడలేదు. "చనిపోయాడా? ఆత్మహత్య చేసు కున్నాడా? అని అడిగాను. "లేదులేదు ప్రమాణం చేసిచెప్తాను. పోలీసు సిబ్బందితో చుట్టుప్రక్కల గ్రామాలన్నీకూడా వెదకించాను. ఏమీ ప్రయోజనం లేకపోయింది"అన్నాడు. పెరిగిపోయే క్రోధంతో "నాబిడ్డ కనిపించేవరకు నువ్వు, నా కొడుకుని దూరంచేసిననువ్వు, నాదగ్గరకు రాకు. నన్ను చూడకు నిన్ను పొమ్మంటున్నాను" అని అరిచాను. ఆయన శోకతప్తుడై వెళ్ళిపోయాడు. ఇది జరిగి ఇరవై దీర్ఘ సంవత్సరాలు గడిచాయి. అప్పట్నించి వాళ్ళిద్దరిలో ఒక్కరినికూడా చూడలేదు. ఇది నా అనేవారు లేక ఆకాశంవంక చూస్తూ ఇరవై సంవత్సరాలు గడిపాను. తగిలిన గాయాల్తో బాధ పడ్తూ నా స్త్రీహృదయం, మాతృహృదయం ఏడుస్తూ, ఎదురు చూస్తూ అంతంతలేని బాధలను భరిస్తూ ఇరవైసంవత్సరాలు గడిపాను. ఇప్పుడా బాధకి అంతం కనబడింది. ఎందుచేతనంటే నేని ప్పుడు మరణిస్తున్నాను. నా రక్తంలో రక్తం నా బిడ్డగాని, నా ప్రియుడుగాని లేకుండానే చనిపో

తున్నాను. వినోద్ ప్రతిరోజూ ఉత్తరాలువ్రాస్తే వాడు తాను కలుసుకుంటానని కాని నేను నిరాశ రించేదాన్ని. ఎందుచేతనంటే వినోద్ నన్ను కలుసుకొన్నక్షణంలోనే మళ్ళీ నా కుమారుడొస్తాడనే భయంతో. నా హారీన్!...ఇంకా బ్రతికున్నాడో, లేదో!...ఎక్కడ దాగుని వున్నాడో!...చాలా దూరంలో ఆ నీలిసముద్రం ఆవలివైపున పేరులేని దేశంలో ఉన్నాడేమో!...నా గురించి ఎప్పుడైనా ఆలోచిస్తాడా!...ఆ చిన్ని హృదయంలో అంత కఠినత్వమెక్కడిదో? హృదయంలోని బాధ, ఆవేదనలతో నేనెంత రోదించానో, నిరాశ, నిస్పృహలతో ఎంత అగాధంలో మునిగిపోయానో నా బిడ్డఆలోచించాడా? వాడికోసం ఈ రోజు దాకా జీవిస్తున్న నన్ను, నవమాసాలు మోసి కనిపెంచిన తల్లిని, హృదయంలోని ప్రేమ సంతటితోను పెంచిన తల్లిని ఎట్లా మరిచిపోతాడో! ఆమె మాతృహృదయం ఎంత తల్లడిల్లిపోతుందో ఆలోచించాడా? ఇంతకంటే క్రూర హింస మరొకటుంటుందా అజయబాబూ!...నేను చెప్పినదంతా వాడికి చెప్పండి. ఇంకా ఇలా చెప్పండి. "నా ప్రియమైన హారీన్, నీ తల్లిని ఇంకా అంత కఠినత్వంతో చూడకు. ఆమె జీవితామంతా బాధ, ఆవేదనలతో గడిచిపోయింది. నీవు విడిచి వెళ్ళిపోయినప్పటినుండి ఆమె జీవితం ఎలాక్షీణించిపోయిందో ఆలోంచించు. ఆమె భగ్నహృదయం ఎలా పరితపించి పోయిందో ఆలోచించు. ఆమెను అప్పటికైనా క్షమించు. ప్రేమతో ఆమెను ప్రార్థించు ఆమె పొందిన బాధా, పశ్చాత్తాపం మరియేతల్లికూడా అనుభవించలేదని గ్రహించు."

ఆమె మరికొన్ని నిముషాలు ఆగి అన్నది. "అజయబాబూ,ఇదికూడా నాకుమారునికిచెప్పండి "నేను ఆ రోజునుంచి వినోద్‌ని మళ్ళీచూడలేదు."" ఆమెకన్నీరుఆగిపోయింది; క్షీణస్వరంతో గొణిగింది.

"మిమ్మల్ని వెళ్ళిపొమ్మని ప్రార్థిస్తున్నాను. జీవితంలో నేనుప్రేమించిన వారిద్దరూ నామరణశయ్య దగ్గరలేరు. కాబట్టి నేను ఒంటరిగానే మరణిస్తాను."

అజయబాబు బయటకు వచ్చేనాడు. మోటారు డ్రైవర్ని పిలిచినప్పుడు అతని గొంతుకు గద్గదమయింది. తర్వాత కొన్ని సంవత్సరాలకు నాకీజాలి గాథ వినుపిస్తూ అన్నాడు:

"ఇప్పటికీ కూడా ఆమె కొడుకురాలేదు. వాని హృదయం ఎటువంటిదో ఆలోచించలేకుండా వున్నాను. తల్లి వ్యామోహపు పనిచేసినప్పటికీ, హారీన్‌బాబే, తల్లి హృదయాన్ని ప్రక్కలుచేసిన పాతకుడు, నేరస్థుడూ."

(ఆధారం: ఒక ఫ్రెంచికథ)

స్కెచ్

# ఛాన్సు వస్తే సరేసరి!

గన్నిశెట్టి వెంకటేశ్వరరావు

"మనిషికొక్క పిచ్చి మహిలో వేమా!" అన్నట్లు మా సుబ్బాయిగాడికీమధ్య, సినిమాల్లో నటించాలన్న పిచ్చిపట్టింది. అది క్రమేణా వృద్ధిజెంది, మేహాపుండులా మానకుండా, వాడినేగాక, మా మిత్రబృందాన్నంతటినీ, బాధించ సాగింది. ఏనాటికయినా సినిమా లోకంలో తను తారాపథాన్నందుకొనక తప్పదని, మావాడి గట్టినమ్మకం అలా నమ్మి తీరవలసిందిగా, మా మిత్రబృందాన్నంతటిని, నిస్సంకోచంగా శాసిస్తాడు. వాడితో వాదించవలసిన ఖర్మ యెలావున్నా, వాడినుండి మాకుముట్టే; కాఫీలు, సిగరెట్టులూ లభ్యంకాకుండా పోతాయన్న భయంతో, నమ్మినట్లు నటించక తప్పదు మరి! ఇహ వాడికి గేస్‌కొట్టి, వాడిపిచ్చిని మరింత వృద్ధిజేసి వాడి మన్ననలకు పాత్రులయ్యే మా చలపాయిగాడి రకం వుండనే వుంటుందనుకోండి.

ఈమధ్య మావాడి ధోరణి మరీ విపరీతమయింది. వేష భాషలన్నీ అచ్చంగా సినిమావాళ్ళ ఫక్కీలోనికి మార్చటమేగాక, ఏనటుడికే అలవాట్లున్నాయో, ఏతార యేసబ్బు వాడుతుందో, ఏ